

# నల్లనాగు

దాశరథి రంగాచార్య


## "అమ్మా!"

సుజాత సోఫాలో కూర్చుంది. తీరిగ్గా ఉంది. వారపత్రిక అందుకుంది. సీరియల్లో మునిగిపోతుంది. ఆమెకు ఏమీ కనిపించలేదు. వినిపించలేదు.

"అమ్మగారూ!"

పిలుపు కాస్త బిగ్గరగా ఉంది. సుజాత సీరియల్లోంచి బయటపడింది. పైకిచూసింది. తలుపులు బార్లాతీసి ఉన్నాయి. మెట్లమీద ఒక అమ్మాయి నుంచుంది.

అమ్మాయి నల్లరాతి బొమ్మలా ఉంది శిల్పి మలచిన శిల్పంలా ఉంది. నల్లగా ఉంది. కాటుకలా ఉంది. మధ్య పాపిట తీసింది, వెంట్రుకలు బిగదీసింది. నొసటి కొసన మొలిచాయి కొన్ని వెంట్రుకలు. అవి లొంగ లేదు. గాలికి ఆడుతున్నాయి, నొసట కుంకుమ పొడిచిన పొద్దులా ఉంది. కళ్ళు ఆలిచిప్పల్లా ఉన్నాయి. వాటిల ఎర్రని జీరలున్నాయి. కళ్ళు కాస్త ఎరుపు వాటిల్లో అమాయకత కాపురం పెట్టింది. ముక్కు తీర్చిదిద్దినట్టుంది. దానికి ముక్కెర ఉంది. ముక్కెరకు ఎర్రరాయి ఉంది, అది



మెరుస్తూంది. బుగ్గలు నున్నగా ఉన్నాయి. వేయి స్తంభాలగుడి స్తంభాల్లా మెరుస్తున్నాయి. పెదవులు ఎర్రగా ఉన్నాయి. మందారాల్లా ఉన్నాయి. చుబుకం చిన్నగా ఉంది. ముద్దొస్తూంది. మెడ కురచగా ఉంది. నల్లపూసలు రంగులో కలిసిపోయాయి. పయ్యెదలో పరువం పిటపిటలాడుతూంది.

చూస్తూ ఉండి పోయింది సుజాత. నవల్లో నాయిక కంటే అందంగా ఉంది.

"అమ్మగారూ, పని మనిషి కావాలె న్నారట."

సుజాత ఈ లోకంలోకి వచ్చింది.

"నువ్వు పనిచేస్తవా" ఆశ్చర్యం వ్యక్త పరిచింది.

"అవ్వనమ్మ! పనిమనిషి కావలెనన్నరట. వచ్చిన."

"నీ పేరు"

"నీలమణి అంటరు."

"పేరు బావుంది - నీకు తగినట్లు పని జాగ్రత్తగా చేసావా. మా ఇంట్లో అంతా గజు సామా నుంది."

నా కెరికేనమ్మా పదిలంగ పనిచేస్త"

తరువాత నెల జీతాన్ని గురించి బేరం జరిగింది. నీలమణి ఒప్పుకుంది. నీలమణి లోనికి వచ్చింది. గిన్నెలు తోమిపెట్టింది. గాజు సామాను కడిగిపెట్టింది. అది పరీక్ష ఆమె నెగ్గింది. మెచ్చుకుంది సుజాత, నీలమణి ముఖం వెలిగింది. మబ్బుల్లో మెరుపు మెరిసింది. తెల్లవారి నుంచి వస్తానని చెప్పింది నీలమణి. వెళ్ళిపోయింది.

నీలమణి సుజాత ఇంట్లోకి రావడం. పోవడం చూశారు ఇరుగమ్మలు. పొరుగమ్మలు, బిగబా వచ్చేశారు. నీలమణి ఎందుకు వచ్చిందని అడిగారు. చెప్పింది సుజాత.

"అబ్బో! అది సంగనాచి, మగవాళ్ళ మనసు పాదరసం లాంటిది. దాన్నెందుకు పెట్టుకున్నారు" ఆశ్చర్యం వ్యక్తపరచారు అమ్మలక్కలు.

చిరునవ్వు నవ్వింది. సుజాత. "మావారు అలాంటివారుకారు. మరో ఆడదాన్ని కన్నెత్తైనా చూడరు మీరు నిశ్చింతగా ఉండండి" సుజాత కళ్ళల్లో గర్వం కనిపించింది.

వచ్చినవారు మూతులు విరిచారు. నీ ఖర్మ. అన్నట్లు చూశారు వెళిపోయారు.

సుజాతకు విశ్వనాథం కనిపించాడు కళ్ళలో. విశ్వనాథం నిష్ఠ గలవాడు. అతడు సుప్రభాతం చదువుతాడు. విభూతి వంటి నిండా ధరిస్తాడు.. సంధ్య వారుస్తాడు. నమకం. చమకం ఏగెరాలన్నీ చదువుతాడు. నిత్యం పూజ చేస్తాడు. విభూతితోనే ఆఫీసుకు వెళ్తాడు. అతనొక ఆఫీసరు. గుడి కనిపిస్తే గుంజిళ్ళు తీస్తాడు. ఆఫీసులో అతనికో స్టెనో ఉంది షర్మిలా-పగలాడ-వన్నెల విసనకర్ర. ఆవిడ విశ్వనాథానికి వల పన్నింది ప్రమోషన్ కోసం. విశ్వనాథం లొంగలేదు. షర్మిలాను ట్రాన్స్‌ఫర్ చేయించాడు, ఆ విషయం తెలిసింది సుజాతకు. సుజాత పొంగిపోయింది. విశ్వనాథాన్ని ముద్దుపెట్టుకుంది మెచ్చుకోలుగా.

తెలవారి నీలమణి వచ్చింది. తలుపు తట్టింది. విశ్వనాథం తలుపు తీశాడు. నీలమణిని చూశాడు. చూస్తూ ఉండిపోయాడు.

"పని మనిషిని. అమ్మగారు పెట్టుకున్నారు. అడ్డం జరుగుండి

అడ్డు జరిగాడు విశ్వనాథం. నీలమణినే చూస్తున్నాడు. అటునుంచి సుజాత వస్తూ ఇటునుంచి నీలమణి పోతూ కనిపించారు. విశ్వనాథం నీలమణి నడకను చూశాడు. ఆమె పిక్కలు మెరుస్తున్నాయి. సంగడి పట్టిన నలమద్ది కోళ్ళలా ఉన్నాయి. వాటికి వెండి కడియాలున్నాయి, అవి తళుక్కుమంటున్నాయి.

ఆ నాడూ పూజచేశాడు విశ్వనాథం. అతనికి శివుడు కనిపించలేదు. నీలమణి కనిపించింది, సుజాతను తలుచుకున్నాడు. తేరుకున్నాడు. నిగ్రహించుకున్నాడు, ఆఫీసుకు వెళ్ళాడు.

నీలమణి పనికి వస్తూనే వుంది.

విశ్వనాథం చూస్తూనే ఉన్నాడు సుజాత కంటపడకుండా.

ఒకనాడు టెలిగ్రాం వచ్చింది. సుజాత తల్లికి జబ్బుగా ఉందని. విశ్వనాథం తనకు సెలవు లేదన్నాడు రావడం వీలుపడ


దివ్య నూతన కాంతులతో విరాజిల్లే
దీపావళి పండుగ సందర్భమున మాఖాతాదారులకు
హృదయపూర్వక శుభాకాంక్షలు




ఈ శుభ సమయమున కనుల కింపైన రంగులు,
ఆకర్షణీయమైన డిజైనులుగల
కంచి, ధర్మవరం, బెనారస్ పట్టు చీరలు
మరియు మీ అందాన్ని ద్విగుణీకృతం చేయుటకు వలయు
అమెరికన్ జార్జెట్ ప్రింటు, యంత్రాయిడరీ
చీరెలు స్టాకు వచ్చియున్నవి
పురుషులకు కావలసిన
టెరీన్, టెరీకాట్, టెరివూల్, సూటింగ్స్, షర్టింగులకు

అశోక్ స్టోర్సు బీసెంట్ రోడ్ విజయవాడ-2

N. B. :- స్కైచ్‌లాన్ సూటింగ్స్‌కు మా ప్రత్యేకత




దన్నాడు. సుజాతకు వెళ్ళక తప్పలేదు. వెళ్ళింది.

తెల్లవారింది. నీలమణి తలుపు తట్టుతుందని చూశాడు. నీలమణి రాలేదు. రాదని తెల్సుకొన్నాడు. సుజాత రావద్దని చెప్పిందనుకున్నాడు. కట్టుదిట్టం చేసి వెళ్ళిందనుకున్నాడు. కస్సు బుస్సుమనుకున్నాడు. ఆడవాళ్ళంతా ఇంతే ననుకున్నాడు. ఆఫీసుకు వెళ్ళాడు. తిరిగి వచ్చేప్పుడు స్కూటరు నీలమణి ఇంటివైపు మళ్ళించాడు. ఇల్లు తెలుసుకోవడం కష్టం కాలేదు.

నీలమణి గుడిసెముందు కూర్చుంది. చేటలో బియ్యం ఏరుతూంది. స్కూటరు చప్పుడు విన్నది. తలెత్తింది. విశ్వనాథం కనిపించాడు. లేచి నుంచుంది.

"పనికి రాలేదేం?"

"అమ్మగారు వేరుగద!"

"హోటలు తిండి పడదు నాకు. కాస్త వండిపెట్టాలి. ఏమంటావ్"

"అట్టనే ఎస్తా - పొద్దాల"

"ఇప్పుడు రారాదూ!"

"ఆయనొచ్చే అన్నానికి-పొద్దాలవస్తా"

"సరే. ఈపూట హోటల్లో తింటా. ఉదయం తప్పకుండా రావాలి. ఏమంటావ్"

"అటనేనుంటి

విశ్వనాథం స్కూటరు సాగిపోయింది.

తెల్లవారకుండానే లేచాడు విశ్వనాథం. తలుపు తట్టిన చప్పుడు కోసం ఎదిరి చూశాడు.

కాలం కదలడంలేదు.

తలుపు తట్టడం వినిపించడంలేదు.

నీలమణి రాదేమోననుకున్నాడు. ఏదో పోగొట్టుకున్నట్టు వెదుక్కో సాగాడు.

తలుపు తట్టిన చప్పుడు వినిపించింది. ఉరికాడు విశ్వనాథం. తలుపు తీశాడు.

నీలమణి కనిపించింది.

విశ్వనాథంలో విద్యుత్తు ఉరికింది.

నీలమణి తల వంచుకుంది. సాగిపోయింది

విశ్వనాథం ఆమె నడకను చూస్తున్నాడు పిక్కల్ని చూస్తున్నాడు.

విశ్వనాథం తలుపు వేశాడు. గొళ్ళెం వేశాడు.

నీలమణి గమనించలేదు. ఆమె పనిలో మునిగిపోయింది.

ఇల్లు ప్రశాంతంగా ఉంది. ఎవరూలేరు. తాను నీలమణి. విశ్వనాథం గుండె ఉరుకులు పెట్టింది. గదిలోకి వెళ్ళాడు. కొన్ని నోట్లు తీసుకున్నాడు. డబ్బు అన్నింటినీ కొనగలదనే విశ్వాసం విశ్వనాథానిది. అందుకే అతనికి భక్తి మెండేమో!

విశ్వనాథం నీలమణి దగరికి చేరాడు. నీలమణి గిన్నెలు తోముతూంది బూడిదతో. ఆమె చేతులనిండా బూడిదఉంది. విశ్వనాథం డబ్బు చూపాడు నీలమణికి.

"జీతం నెయలికి తీసుకుంట - అమ్మగారిస్తది."

"జీతంకాదు. ఉంచుకో - పాపం కష్ట పడుతున్నావు."

"మేం కష్టపడేటోండ్లమే" నీలమణి తల పైకెత్తలేదు. ఆమె గాజు ప్లేటు తోముతూంది.

విశ్వనాథం మరీ దగ్గరికి వచ్చాడు.

నీలమణి గమనించింది. ఆమె గుండె గుబగుబలాడలేదు. కాళ్ళు వణకలేదు. నోరు ఆరుకొని పోలేదు. ఆమె పని చేస్తూనే ఉంది. చేతిలో గాజు ప్లేటుంది.

విశ్వనాథం నీలమణి చేయిపట్టుకున్నాడు నీలమణి చేతిలోని ప్లేటు జారిపడింది. చప్పుడైంది. పగిలింది. విశ్వనాథం గమనించినట్లు లేదు. నీలమణి చేయి విశ్వనాథం చేతిలో ఉంది. చేయిమెత్తగ లేదు. పూవులా లేదు. సుజాత చేతిలాలేదు. అది కఠినంగా ఉంది. కర్కశంగా ఉంది. రాయిలా ఉంది.

నీలమణి విశ్వనాథాన్ని చూసింది. ఆమె కళ్ళు ఎర్రగా ఉన్నాయి, మోదుగు పూలలా ఉన్నాయి. ఆ కళ్ళు విశ్వనాథంలో అగ్గి రగిల్చాయి. మరో అడుగు ముందుకు వేశాడు.

"అయ్యగారూ! చెయ్యి వదులుండి మీరు పెద్దోళ్ళు"

"అదేం లేదు ఒక్కసారి." ఇకిలించాడు విశ్వనాథం.

"విడువుండి" గట్టిగా అరిచింది.

విశ్వనాథం ఆమెను దగ్గరికి లాక్కున్నాడు.

నీలమణి విదిలించింది. చేయి విడిపించుకుంది. దూరం జరిగింది.

విశ్వనాథం లంఘించాడు. పొదివి పట్టుకున్నాడు.

నీలమణి మండిపోయింది. అగ్నిజ్వాల అయింది. పెద్దగా కేకలు పెట్టింది. విశ్వనాథాన్ని నెట్టింది. అతను పడిపోయాడు. అతని బుజానికి పగిలిన గాజు పెంకు గుచ్చుకుంది. రక్తం కారుతూంది. నీలమణి అది చూడలేదు. ఆమె ఆదిశక్తిలా ఉంది. విశ్వనాథం చేయి అందుకుంది. కేకలేస్తూంది. బయటికి లాక్కుపోతూంది. విశ్వనాథాన్ని గుమ్మం బయటికి లాక్కొచ్చింది.

నీలమణి కేకలు విన్నారు చుట్టుపక్కల వాళ్ళు కూడాను.

"చూసిన్రా అమ్మ - నేను కావల్నట ఈ అయ్యకు. బంగారుమసుమంటి పెండం ఉన్నది" నీలమణి అరుస్తూంది. అందరికీ చెప్తూంది. విశ్వనాథం కిక్కురుమనలేదు. తల వంచుకున్నాడు. నుంచున్నాడు.

ఇంటిముందు ఆటో ఆగింది. సుజాత దిగింది. విన్నది. చూసింది.

"నాటకం వేసింది ఇందుకా?" అని నీలమణి నువ్వు గట్టిదానివి. ఆడది లొంగిపడది. ఎదిరించాలి. ఆడది ఎదిరించాలి. ఎదిరించక గత్యంతరంలేదు" అంటూ పెద్ద పెద్ద అంగలు వేస్తూ ఇంట్లోకి వెళ్ళింది. తలుపు దఢాల్న వేసింది. విశ్వనాథం ముఖాన మూసినట్లుంది తలుపు.

విశ్వనాథం అటు చూశాడు.

కూడిన ఆడవారు ఘొల్లుమని నవ్వారు.

విశ్వనాథం పూజ చేయలేదు. అయినా అతని ముఖానా, వంటినా బూడిద ఉంది. బుజానికి గాయం వుంది. అతనికి ఆ బాధ తెలియడంలేదు. అతడు మూతపడిన తలుపులే చూస్తున్నాడు.

నీలమణి వెళ్ళిపోతూంది.

కూడిన మగవాళ్ళంతా ఆమెనే చూస్తున్నారు.

ఆమె నల్లనాగులా కనిపించింది.

వంకరు వంకర్లుగా సాగిపోతూంది నీలమణి-కాదు- నల్లనాగు.

★